# ఈ తరంతో ఆ తరం

"తాయారూ! తాయారూ!" అంటూ భార్యని వెతుక్కుంటూ వంటింట్లోకి వచ్చారు చలంగారు.

"వస్తున్నానండీ!" అంటూ తిరగలి ముందునుంచి లేచి, ఒళ్ళు దులుపుకుంటున్న భార్యతో "ఏమేవ్! అబ్బాయిలిద్దరి దగ్గర నుంచీ కూడా ఉత్తరాలొచ్చాయే. పండక్కి కోడళ్ళతో సహా వస్తున్నారుట" అంటూ చెప్తున్న మాటలకి తాయారమ్మ ముఖం చంద్రుడిని చూసిన కలువపువ్వులా వికసించిపోయింది.

"వాళ్ళు వస్తారని నాకు తెలుసండీ. అందుకే మినపసున్నికి పప్పు వేయించి విసురుతున్నాను. వాళ్ళిద్దరికీ మినపసున్ని అంటే చాలా ఇష్టమండీ!

చూడండి. బజారుకెళ్ళి మంచి బెల్లం ఓ అరకిలో పట్రండి. పెద్దాడికి పంచదారతో ఇష్టం. చిన్నవాడికి బెల్లం మినపసున్ని ఇష్టం. ఉండలు చేసి వుంచితే మధ్యాహ్నాలు కాఫీతో తింటారు.

అన్నట్లు మర్చిపోయాను. మిషన్లో ఓ కే.జీ. బియ్యం పోయించి మెత్తటి పిండి పట్టించి తీసుకురండి. మనవలకి చేగోడీలు ఇష్టం. కాసిన్ని చేసి వుంచుతాను" అంటున్న భార్యను చూస్తూ–

"ఈ మినపసున్ని కూడా మిషన్ పట్టించేద్దునుకదే! ఎందుకలా చెమటలు కారుస్తూ ఓపిక లేకుండా ఆ విసరడం? జబ్బులు లాగుతాయి కదా!" అన్నాడు.

"అది కాదండీ! మిషన్‌వాడు సరిగ్గా విసరకపోతే మినపసున్ని బాగుండదండీ. అయినా ఆడవాళ్ళం– ఈమాత్రం పనికి బద్ధకిస్తే ఎలాగా?" అంటూ మళ్ళీ తిరగలి ముందు కూర్చుంది తాయారమ్మ.

అలాగే అల్లుళ్ళకివిష్టమంటూ, మనవలకివిష్టమంటూ పండగ ముందు దాకా ఏవో ఒక ఫలహారాలు, స్వీట్లు చేస్తూనే వుంది. పండగ సందడంతా తాయారమ్మ, చలంగార్ల ఇంట్లో బంధింపబడినట్లు, ఇల్లు పండక్కి రెండు రోజుల ముందునుంచే కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడళ్ళు, మనవలతో కళ కళలాడిపోతూ వుంది.

పుట్టింటికొచ్చిన ఆడపిల్లలు తల్లిదండ్రుల దగ్గర మళ్ళీ బాల్యావస్థలోకొచ్చినట్లు గారాలు గుడుస్తూ తిరుగుతుంటే, కూతుళ్ళు, కోడళ్ళు అన్న భేదం లేకుండా చూసుకునే తాయారమ్మ కోడళ్ళిద్దర్నీ కూడా కూతుళ్ళతో సమానంగా ఇటూ అటూ తిరగడానికి వెళ్లమని, వీధివసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకోమని పంపేసి తాను మాత్రం అందరికీ వంట నిమిత్తం వంటింటికే అంకితమై పోయింది.

వారం రోజులు సెలవు పెట్టుకొచ్చిన పిల్లలు ఓరోజు సినిమాకంటూ, ఓ రోజు పక్కనున్న ఊళ్ళో ఏదో చూడాలంటూ, మరో రోజు బజారుకంటూ, ఇంకో రోజు పక్కన ఎక్కడో ఎగ్జిబిషనంటూ, ఓనాడు పిక్‌నిక్ కెళ్దామంటూ ప్రయాణం అవడంతో పాటు "అమ్మా! ఇవాళ పెందరాళే అన్నం తినేస్తామే!" అని, ఇంకో రోజు రాత్రి పదకొండు దాటుతుందని, పిక్‌నిక్‌నాడు "అమ్మా! పులిహోరా, దద్దోజనం చేసి కేరియర్‌లో పెట్టవా? తీసుకెళ్తా"మంటూ తాయారమ్మని హడావిడి పెడుతుంటే- "అలాగేనర్రా!" అంటూ అడిగినవీ, అడగనివీ కూడా చేసి అందించేదా ఇల్లాలు.

పండక్కొచ్చిన పిల్లల, కుటుంబాలకీ బట్టలు కొనాలని చెప్పిన తాయారమ్మ వైపు బేలగా చూస్తున్న భర్తని చూసి- "అదేమిటండీ! అలా చూస్తారు? మనం పెద్దవాళ్ళం అయిపోయాం. మళ్ళీ ఇలా నాలుగు కుటుంబాలూ ఒక్కసారి మనింటికి నేను బ్రతికుండగా రాగలుతాయో లేదో!

ఒకరికి కుదిరితే మరొకరికి కుదరక ప్రతీసారీ ఎవరో ఒకరు రాక లోటుగానే వుంటోంది. ఈసారి సెలవులు దొరికి అంతా వచ్చారు. మీ బెంగ అర్థం చేసుకోగలను. డబ్బెక్కడినుంచి తేను అని కదా!" అంటున్న భార్యని చూసి-

"అవునే తాయారూ! అంతమందికీ బట్టలు కొనాలంటే కనీసం అయిదువేలన్నా కావాలి కదే! చిన్నపిల్లలకి రెండేసి వందలిచ్చినా, పెద్దవాళ్ళకి అయిదేసి వందలన్నా పెడితేగాని ఓ మోస్తరు బట్టలురావు కదా! మనదగ్గరంత ఎక్కడుందిప్పుడు?"

"నాకు తెలుసండీ! ఖర్చొచ్చినప్పుడు డబ్బుండదు. అలా అని మానేస్తామా? డబ్బున్నప్పుడు ఖర్చులూ రావు. ఇదిగో నా చేతివి ఈ గాజులజత వుంది తాకట్టుపెట్టి తెండి. పంటలొచ్చాక విడిపించుకోవచ్చు" అంటూ అందించిన గాజులజతని వెర్రివాడిలా తాయారుని చూస్తూ చెయ్యి జాపి అందుకోక తప్పలేదు చలంగారికి.

చలంగారు గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. అదీ గుమస్తాగిరీ- రిటైరయ్యేనాటికి సీనియర్ క్లర్కు మాత్రమే! ఇది వరకు పద్ధతి ప్రకారం ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు పుట్టగానే ఇక చాలనుకున్నారు.

చెల్లెళ్ల, తమ్ముళ్ల బాధ్యతలు తీరాయనుకునే నాటికి తనింట్లో పిల్లలు ఎదిగిపోయి చదువులు, పెళ్ళిళ్ళు అంటూ బాధ్యతలు తరుముకొచ్చాయి.

కొడుకులిద్దరికి పి.జి.లు చెప్పించి, ఆడపిల్లలిద్దర్నీ గ్రాడ్యుయేట్స్‌ని, ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసేనాటికి పదెకరాల పొలం కరిగిపోయి కొద్దిగా పొలం, పాత పెంకుటి కొంప మిగిలాయి చలంగారికి. ఆ పొలం మీద వచ్చే ధాన్యం గింజల్ని తిండికి తెచ్చుకుని పెన్షన్ డబ్బులతో నెల గడుపుకుంటున్నారు.

ఎవరన్నా దస్తావేజులు రాయాలన్నా, ఏ కొట్లో గుమాస్తా అన్నా సెలవుపెడితే అక్కౌంట్లు రాయడానికి పిలిస్తే వెళ్తే ఇచ్చే డబ్బులే పై రాబడి.

తమ జీవితాలెలా గడుస్తున్నాయో ఒక్కనాడు కూడా ఆ దంపతులు పిల్లలికి చెప్పుకోలేదు. కొడుకులు పెద్దపెద్ద ఉద్యోగస్తులు కాకపోయినా వారి బ్రతుకులు లోటులేకుండా గడిచిపోయే జీతాలే వారివి. ఆడపిల్లల్ని కూడా మంచి కుటుంబాల్లోనే ఇవ్వడంతో వారూ హాయిగానే వున్నారు.

'మన బ్రతుకులు ఎలాగున్నా నలుగురూ హాయిగా వున్నారు. వెనకతిరిగి చూడక్కర్లేని సంబంధాలు ఆడపిల్లలవి. నాలుగువేళ్లూ నోట్లోకెళ్లే ఉద్యోగాలు కొడుకులవి' అనుకుని ఆనందపడ్డారేకానీ తమ భూమి, ఆస్తీ కరిగిపోయాయని బాధపడలేదు. పెళ్ళిళ్ళకి ఆడపిల్లలకి బంగారం పెట్టాలనివున్న కోరికని తాయారమ్మ తనకి పుట్టింటివారెట్టిన నగల్ని తీసిచ్చి గాజులు, చంద్రహారాలు చేయించిపెట్టి తీర్చుకుంది.

కోడళ్ళ టైము వచ్చేసరికి 'ఆడపిల్లలకి పెట్టి కోడళ్ళకి పెట్టకపోవడమేమిటి? పెళ్ళిలో నలుగురూ 'మీ అత్తారేం పెట్టా'రని కోడళ్ళని అడిగితే ఆ చిన్నతనం మనకే కదా!' అనుకుంటూ అత్తవారెట్టిన నగలతో వారికీ నగలు చేయించిపెట్టింది.

తరువాత మనవలకి - ఇలా ఆమె ఒంటిమీద నగలన్నీ తరిగి, ఇంట్లో అందరికీ ఆభరణాలమిరి చివరికి ఆమెకంటూ మిగిలినవల్లా మెడలో బొందుతాడుతో పుస్తెలు, చేతిని ఓ జత గాజులు. అయినా ఆమె ముఖంలో వున్న కళ, ఆనందం, తృప్తి నగలు లేవన్న లోటుని కనబర్చలేదు.

కన్నపిల్లల భవిష్యత్‌ని మనచేతిలో వున్నంతలో మంచి మార్గంలో తీర్చిదిద్దాలి. వారి ఆనందమే మన ఆనందం, వారి సౌఖ్యమే మనకు తృప్తి. పూర్వకాలం వాళ్లల్లా పెంచి పెద్దచేసిన పిల్లల దగ్గరనుంచి ప్రతిఫలాన్ని ఆశించడం ఈ రోజుల్లో సమంజసం కాదు.

ఉమ్మడి కుటుంబంలో తనూ అత్తవారింట్లో వుండి ఆడబిడ్డలు, మరుదులకి చేసినా కాలాన్ని బట్టి మారాలి అన్న నిజాన్ని వంటబట్టించుకున్న తాయారమ్మ భర్తకి వెనక ఆస్తి లేదని, తనకేం బంగారునగలు చేయించటంలేదని ఏనాడూ తూలనాడలేదు. 'ఉన్నదాంతో తృప్తిపడితే కలిగే ఆనందం వేరు' అని ఎంతో పొదుపుగా సంసారం చక్కబెట్టుకొచ్చింది.

పెళ్ళిళ్ళయి ఆడపిల్లలు అత్తవారింటికెళ్ళినట్లే ఉద్యోగాలయి కొడుకులు భార్యలతో అయా ఊళ్ళు వెళ్ళిపోయారు. రెక్కలొచ్చిన పక్షుల్లా షష్టిపూర్తయిన ఆ దంపతులు మళ్లీ

వైవాహికజీవితం మొదటిఘట్టంలా ఒకరికొకరై సొంత ఇంట్లో వుంటూ కాలక్షేపం చేసుకుంటున్నారు. సొంతూరు, సొంతింటిమీద మమకారంతో కొడుకుల వద్దకి వెళ్ళలేదు.

నాలుగంకెల జీతాలైనా పట్నవాసాల్లో ఇళ్ళద్దెలు, పిల్లల చదువులకి పోగా తిండికి లోటులేకుండా సాగిపోతున్న కొడుకులూ తల్లితండ్రులకి నెలనెలా ఎత్తి డబ్బు పంపలేక పోయేవారు.

ఏ ఒక్కనాడూ తల్లిదండ్రులు వారి కష్టసుఖాలు పిల్లలదగ్గర చెప్పుకోకపోవడంవల్ల కొడుకుల మనసుల్లో కూడా 'ఆం–ఉన్నది ఇద్దరే కదా! ఏం ఖర్చులుంటాయి?' అన్న ఓ భావం ఏర్పడింది.

ఒక్కరూ ఉన్నప్పుడు ఈ దంపతులు ఎలా గడుపుకుంటున్నా పిల్లలొచ్చేనాటికి ఆ ఇల్లాలు చేసే హడావిడి చూసి వారి బ్రతుకులు దర్జాగా వున్నాయన్న భావం కూడా ఏర్పడిపోయింది వారికి.

* * *

"అమ్మా! నాన్నకి చెప్పమ్మా – పండక్కి మాకు బట్టలు పెడతారు కదా! ఆయన్ని బజారుకెళ్ళి కొని తేవద్దని – లేటెస్టు ఫేషన్లని మేము వెళ్ళి తెచ్చుకుంటాము. మాకు డబ్బు ఇచ్చేయమని చెప్పమ్మా!" అని కూతుళ్ళు అనగానే "అవునత్తయ్యగారూ! మేం ఎలాగూ మార్కెట్టుకెళ్ళాలనుకుంటున్నాం. కొని తెస్తాం" అంటున్న కోడళ్ళవైపు చూస్తూ –

"అలాగేనమ్మా! ఈయనతో చెప్తానుండండి" అంటూ వెళ్ళి చెప్పడం, చలంగారు గాజులు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులివ్వడం, వాళ్ళు మార్కెట్‌కి బయలుదేరడం వెంటవెంటనే జరిగాయి.

'అమ్మా! నీ గాజులే'వని పిల్లలు అడుగుతారేమో నన్న భయంతో చేతులమీంచి కొంగు కప్పుకుని తిరుగుతున్న విషయం ఒక్క చలంగారే కనిపెట్టారు. పిల్లలెవ్వరికీ ఆ ధ్యాసే వున్నట్లు లేదు.

మార్కెట్‌నుంచి వచ్చిన పిల్లలు, కోడళ్లు తాయారమ్మ, చలంగార్లకి బట్టలు చూపిస్తూ "అమ్మా మీరిచ్చిన డబ్బే సరిపెట్టాలని ఎంత చూసినా కుదరలేదమ్మా. మరో వెయ్యిరూపాయలు పడ్డాయి" అంటూ చెప్పగానే చలంగారి మనసు 'అబ్బా వెయ్యి రూపాయలే' అనుకున్నా, "ఫరవాలేదమ్మా! అనుకున్నంతలో అవుతాయా?" అన్న భార్య నవ్వుముఖాన్ని చూసి కిక్కురు మనలేదు.

"ఆ వెయ్యిరూపాయలు ఎక్కడినుంచి తెద్దామని ఫరవాలేదన్నావే తాయారూ!" అంటూ చాటుగా ప్రశ్నించిన భర్తని నవ్వుతూనే చూసి "పక్కింటి సుబ్బమ్మగారి నడిగి తెస్తానుండండి, కొన్నాళ్ళు జాగ్రత్తగా గడుపుకుంటే ఆ అప్పు తీరిపోతుంది" అని అనడమే కాకుండా ఆ డబ్బు తెచ్చి పిల్లల చేతికిచ్చింది కూడా. పండగనాడు పిల్లలంతా కొత్తబట్టలు కట్టుకుని తాయారమ్మ,

చలంగార్లకి దణ్ణం పెడుతుంటే, ఇస్త్రీబట్టలతో అందర్నీ నోరారా దీవించి తృప్తిగా నవ్వుకున్నారా దంపతులు.

తల్లి చేసిపెట్టిన పెసరట్ల టిఫిను తిని, మధ్యాహ్నం దాకా అటూ, ఇటూ తిరిగి ఇంటికి చేరుకుని బట్టలు మార్చుకుని వంటింట్లోకి రాగానే అందరికీ విస్తళ్ళేసి, మంచినీళ్ళిట్టి వడ్డనకి సిద్ధంగా కూర్చుంది తాయారమ్మ. పిల్లాపెద్దా తాయారమ్మ చేసిన ఆవడలు, బూర్లు తింటూ 'మా అమ్మ హస్తం అమృతం' అని అంటుంటే ఆమె మళ్ళీమళ్ళీ వడ్డిస్తూ తృప్తిగా నవ్వుకోసాగింది.

పిల్లల్ని, వారి కుటుంబాలని చూసి మురిసిపోతూ కొసరి, కొసరి వడ్డిస్తున్న తాయారమ్మని, పక్కనే కూర్చుని భోజనం చేస్తున్న చలంగారు ఆర్ద్రమైన కళ్ళతో చూడసాగారు.

ఒక మిక్సీ అయినా కొనివ్వలేని బ్రతుకు తనది. అయినా తిరగలితో మినపసున్నిని విసిరి పిల్లలకంటూ సున్నుండలు చేసింది. ఉదయం టిఫినంటూ పెసరట్లకి పప్పు, పండక్కి అంటూ ఆవడల పప్పు, బూరెలకంటూ ఆ పప్పు రుబ్బి అందరికీ పెడుతున్న ఆ ఇల్లాలు, పిల్లలు ప్రీతితో తింటూంటే ఉదయంనుంచీ పడ్డ శ్రమంతా మరిచిపోయి ముచ్చటగా అందర్నీ తనివితీరా చూసుకుంటోంది.

తాయారమ్మ ఒక్క బంతిలో కూర్చుని తింటున్న పిల్లల్ని, వారి కుటుంబాలని చూసి 'అబ్బా దృష్టి తగుల్తుంది బాబూ! తల్లి దృష్టి తగని దృష్టిట' అనుకుని మనసులోనే 'ఛీఛీ' అనుకుని ముఖం పక్కకి తిప్పుకుంది. భోజనాలైన పిల్లలంతా తాంబూలాలు వేసుకుని "అమ్మా! సినిమాకి వెళ్ళిరామా?" అనడగ్గానే "వెళ్ళిరండమ్మా!" అంటూ సాగనంపి తను వంటింట్లో కొచ్చి విస్తరిముందు కూర్చుంది.

వీధితలుపులేసి వంటింట్లోకి వచ్చిన చలంగారు ఆవడల పెరుగుతో అన్నం కలుపుకుని, పక్కని చారు, మజ్జిగ గిన్నెలు పెట్టుకుని తింటున్న తాయారమ్మని చూసి స్థాణువులా నిలబడి పోయారు.

"అదేం భోజనం తాయారూ! అందునా పండగపూటా నీకీ భోజనం ఏమిటి?" అంటూ భుజంమీద వేసిన చేతిని ఆప్యాయంగా తొలగిస్తూ, "పోనిస్తురూ నేనేం తింటే ఏమిటి? ఇన్నాళ్ళకి పిల్లలంతా ఒకేసారి కూర్చుని తింటూ 'అమ్మచెయ్యి అమృతం' అంటుంటే, నాకని దాచుకుని వడ్డించకుండా ఎలా వుండగలనండీ? అయినా నేనేం తింటే కడుపు నిండదు?!" అంది ఆరాధనగా భర్తని చూస్తూ.

"తాయారూ! పిల్లలు రావడానికి ముందునుంచీ నువ్వు, వాళ్ళకోసం పడుతున్న తాపత్రయం చూస్తున్నాను. నువ్వు మనిషి మనిషికీ, ఇదిష్టం, అదిష్టం అంటూ చేస్తున్న చాకిరీకి ఎంత విలువ వుందంటావు? ఎంత వాళ్ళు గ్రహించారంటావు??

పుట్టింటికొచ్చిన పిల్లలు రెస్టుగా వుండాలనుకోవడం సహజమే! కోడళ్ళనీ కూతుళ్ళలాగే చూసుకుని వంటింటి దరిదాపులకి రానియ్యటంలేదు. అది వారెంత తెలుసుకునివుంటారు?

'అయ్యో అరవై యేళ్ళ ముసల్ది క్షణం కూర్చోకుండా లేచింది మొదలు కాఫీలనీ, టిఫిన్లనీ, భోజనాలనీ, మళ్ళీ మధ్యాహ్నం టిఫిన్లనీ, తరవాత రాత్రి వంటనీ చాకిరీ చేస్తూ వంటింట్లోనే అతుక్కుపోయింది పాపం' అని ఒక్కసారన్నా తల్చుకుని బాధపడుతున్నారా?

పోనీ అవన్నీ అలా వుంచు – 'అమ్మ వడ్డిస్తోంది తింటున్నామనేగానీ, అమ్మ కూడా మనతో తింటే బాగుండునని గానీ, మనకి వడ్డించేస్తోంది – అమ్మకి వుందా?' అన్న ధ్యాసగానీ ఒక్కళ్ళకన్నా వుందా చెప్పు?

నువ్వు అత్తవారింటికి కోడలిగా వచ్చినప్పుడు ఒక్కసారన్నా నాతో కలిసి భోజనం చేశావా? అత్తగారి వెంట రాత్రి పది, పదకొండుదాకా చాకిరీచేసి నా దగ్గర కొచ్చేదానివి గుర్తుందా?" అంటున్న భర్తవైపు నవ్వుతూ చూసి –

"చూడండి! కాలం మారింది. పిల్లలు మనకంటే ఓ తరం వెనక పుట్టారు. మన ముందుతరంవాళ్ళు పిల్లల్ని స్వార్థంతో పెంచేవారు. ఉమ్మడి కుటుంబాలు దానికి కారణం కావచ్చు. పెద్దవాళ్ళకి మనం అణిగి, మణిగి వుండేవాళ్ళం. ఈ కాలం తీరు వేరు. ఇప్పుడు ఆడామగా పెద్ద పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ప్రపంచాన్ని వాళ్ళు కొత్త దృష్టితో చూస్తున్నారు.

ఈ కాలం పిల్లలకి స్వతంత్ర భావాలెక్కువ. ఉద్యోగాల పేరుతో వేరే వుంటున్న వారికి ఎవరి ఆదుపాజ్ఞలు వుండవు. స్వేచ్ఛగా మసులుతున్న వాళ్ళు పదిరోజులకోసం మనిళ్ళకి వచ్చినప్పుడు వాళ్లని నా ఆదుపాజ్ఞలలో నడవమని, నావెనక చాకిరీ చెయ్యమని అజమాయిస్తే వారికి ఈ ఇల్లంటేనే విసుగు, చిరాకు కలిగి మళ్లీ రాబుద్ధి చెయ్యదు.

ఆడపిల్లల్ని కూర్చోపెట్టి కోడళ్ళని పనులు చెయ్యమనడం అత్తగారి బుద్ధండీ! కాలంతో పాటు మనమూ మారాలి. పిల్లల్ని కన్నాకా పెంచి పెద్దచెయ్యడం మన ధర్మం, కర్తవ్యం అనుకోవాలి. స్వార్థంతో పెంచకూడదు. ఒక మనుషులే పిల్లల్ని పెంచి వారి నుంచి ప్రతిఫలం కోరతారు. ఇతర జీవుల్ని చూడండి! అవి 'బాధ్యత' అనుకుని పెంచి రెక్కలు రాగానే వదిలేస్తాయి.

మీ రోజుల్లో మీ జీతం మీరెప్పుడూ దాచుకుని ఖర్చుచేసుకోలేదు. ఆనాటి ఖరీదులు వేరు. ధరలు మండిపోతున్న ఈ కాలంలో ఎవరి జీతాలు వాళ్ళకే సరిపోవడంలేదు. వాళ్ళు మనకి పెట్టటం లేదనుకునేకంటే, వాళ్ళు మన్ని అడక్కుండా హాయిగా వున్నారని తృప్తిపడాలి.

పాతతరంవారి వద్ద అణిగిమణిగి వున్న మనం ఈ కొత్తతరంవారిని అర్థం చేసుకుని మారక తప్పదు. అటు పెద్దవాళ్ళకి తల ఒగ్గాం, ఇటు పిల్లల భావాల్ని బట్టి మసులుకుంటే వారు మన్ని గౌరవిస్తారు. ఒకందుకు మనం చాలా సంతోషించాలి. మన పిల్లలు మన మాట విని మనం తెచ్చిన సంబంధాలు చేసుకున్నారు. వారు మన్ని ఏ విధంగానూ అగౌరవపరచ లేదు.

ఇంతవరకు ఒక్క కుటుంబంగానే అంతా ఆప్యాయతలు ఇచ్చిపుచ్చుకుంటూ మసలుతున్నారు. అది మన అదృష్టంగా భావించుకోవాలి. కొన్ని కొన్ని కుటుంబాలలో పిల్లలు తల్లిదండ్రులు బ్రతికున్నారో లేదో కూడా కనుక్కోవటంలేదు. అలాంటివారికంటే మనవాళ్ళు నయమనుకోవాలి.

తెల్లారిలేచి పిల్లల్ని స్కూళ్లకి తయారుచెయ్యడం, బస్సులెక్కించడం, మళ్ళీ తీసుకు రావడం. వారి హోంవర్కులతో కుస్తీలు పట్టడం, బయట పనులు చూసుకోడంతోనే వాళ్ళకి సరిపోతుంది.

పాపం నాలుగురోజులు అవన్నీ మర్చిపోయి సరదాగా, విశ్రాంతిగా వుందామని వచ్చినవారిని అర్థం చేసుకోవాలి. చూడండి అంతా ఎలా సరదాగా నవ్వుతూ తిరుగుతున్నారో! మనకి మాత్రం అంతకంటే ఏం కావాలండీ?" అని చెప్పుకుపోతున్న భార్యని చూస్తూ –

'ఏ డిగ్రీ లేకపోతేనేం? కాలాన్ని ఎంతలా చదివింది! అంతేకాదు – ఆ కాలం మనిషిగా అప్పుడు – ఈ కాలం మనిషిగా ఇప్పుడు మారి దాని కనుగుణ్యంగా ఎంత చక్కగా నడుచు కుంటోంది' అనుకున్నారు చలంగారు.

కానీ భార్యమీదున్న అభిమానంతో పిల్లలు చేస్తున్నది సరైంది కాదనిపించి –

"ఎంతచెప్పు తాయారూ! ఈ కాలం పిల్లలకి తల్లిదండ్రులంటే ప్రేమ తక్కువే. ఏం ఒక్క చోటుకన్నా 'మీరు రండి' అని ఒక్కరన్నా అంటున్నారా? వాళ్ళకే కాదు నీకూ విశ్రాంతి కావాలని ఒక్కరన్నా యోచిస్తున్నారా?" అన్నదానికి,

"నా చిన్నతనంలో మా పుట్టింటి కెళ్ళినప్పుడు నేనూ వాళ్ళలాగే వుండేదాన్నండి! మా అమ్మా నాన్నా కూడా ఇలాగే అనుకునేవారేమో!" అన్న మాటలకి చలంగారేం అనకుండా, ఉన్నదే తృప్తిగా తిని, పిల్లల ఆనందమే అమృతమనుకుని త్రేనుస్తున్న భార్యని ఆరాధనగా చూసి 'తల్లి – తల్లే!' అనుకుంటూ బయటికొచ్చారు చలంగారు.

– స్వాతి సపరివారపత్రిక, 8-5-1998